

# కోటుకింద తోడేళ్లు

పోలవరపు శ్రీహరిరావు

రంగయ్యగారు నల్లకోటు కింద తోడేళ్లను దాచుకు తిరుగుతున్నాడు. ఆయన స్కూలుకు వెళ్ళినా, బజారువెళ్లినా, పార్కులో కూర్చున్నా, సినిమా చూస్తున్నా ఆ తోడేళ్లు ఆ ఇక్ష్వాకుల నాటి నల్లకోటు కింద ఆడుకుంటూనే వున్నాయి. ఎన్నోసార్లు ప్రయత్నించినా వాటిని వదిలించుకో లేకపోయాడు సరిగదా అనుక్షణము అతని మనస్సు ఆ తోడేళ్ళ అరపులు, దూకులు, చిలిపి చేష్టల తోనే నిండి, మండిపోతూంది.

భార్యపోయి పదేళ్ళయింది. ఉన్న ముగ్గురు పసిపిల్లల్నీ వాళ్ల అమ్మమ్మ, అంటే తన అత్త గారు పెంచుతున్నారు. తను వాళ్ళ పోషణకై నెలకు నలభై అయిదు రూపాయిలు పంపాలి. మిగిలిన ముప్పై ౫ రూపాయిలతోనూ తను జీవితం సాగించాలి.

బైటవున్నంతసేపూ ఆ తోడేళ్ళబాధతో విసిగి విసిగి ఏడుపొచ్చేది. ఇంటికి రాగానే వాటిని యిక శాశ్వతంగా వదిలించుకోవాలని ఆ కోటు విడిచి వంకెను తగిలించేవాడు. కాళ్లూ చేతులూ కడుక్కొని స్వయంపాకం వడ్డించుకు తినేవాడు. లేచి అన్నీ సర్దుకుని, ఒక్క బీడీముక్క కాల్చే సరికి మళ్ళీ ఆ తోడేళ్లు చిరుగుల చొక్కా కింద బైఠాయించేవి.

మళ్ళా తోడేళ్ళ అరపులూ, దూకులూ, చిలిపి చేష్టలూ—అతని మనస్సు వాటిఆందోళనతో నిండి పోవడం, విసుగు, వాటిని వదిలించుకోలేననేనిరాశా పరిపాటయిపోయింది. ప్రభుత్వం యీ రేషనింగ్ ఎందుకు పెట్టిందో గాని - అందులో యీ దిక్కుమాలిన రంగయ్య మాష్టారి అంతు తేల్చకుండా మనే గొంతెత్తనంకూడా వుంది.

అన్నం వండుకునేప్పుడనుకునేవాడు - 'సోమవారం రేషన్ కార్డుమీద కోటా బియ్యం తెచ్చుకోవచ్చు శని ఆదివారాలు స్నేహితులింట తిన వచ్చు. యీ రెండు రోజులూ సోలెడు సోలెడు వండుకు తినాలిసిందే' నని. తన భార్య బతికున్న రోజుల్లో చెప్పేది - 'మనిద్దరికీ అయితే రోజుకు సోలెడు చాలు' అని. ఆ లెఖ్ఖను యిప్పుడు తనొక్కడికే సోలెడు బియ్యమంటే ఎక్కువే. కాని, ఆకలి తీరడంలేదు. ఆ రోజుల్లో భార్య ఆఫీసూ కాఫీ రెండు పూటలా చేసేదనే సంగతి మర్చిపోయాడు. ఇప్పుడీ తోడేళ్ళ గొడవేమిటా అని ఆశ్చర్యపోతున్నాడు.

తీరిక పీరియడ్‌లో టీచర్స్ రూములో కూర్చున్నప్పుడూ, పదిమందిలోవున్నప్పుడు యీ తోడేళ్ల అరపుకు వులిక్కిపడేవాడు. ప్రక్కవాళ్లా సందడి విన్నారేమో ననే భయంతో సిగ్గుతో చుట్టూ చూచేవాడు. ఎవరూ తన కోటు కింది తోడేళ్ళ సంగతి గుర్తించినట్లేలేదు. అయినా, కోటుమీద అదుముకుంటూ, ఆ తోడేళ్లు ఎదుటివాళ్ళ కంట పడకుండా వుండాలని ప్రయత్నించేవాడు. ఆనాడు కామయ్య పంతులు ఆ తోడేళ్లను పసికట్టి నట్టున్నాడు. అందుకే 'ఏమిటండీ — రంగయ్యగారూ? కడుపులో ఏమిటా గురగురలు?' అని అడిగాడు. అదేంప్రశ్న, వాడి బొందప్రశ్న! తను ఆకలి తోడేళ్ళతో బాధ పడుతూంటే-అవి అరుస్తూంటే, తాను వాటిని అపనయిస్తూంటే-వీడు

ఇలా అంటావేమిటి? తెలివితక్కువ దద్దమ్మ! అందుకనే లెఖ్ఖల మాష్టరయ్యాడు! ఏముంది ఎంతకాలమైనా 2+2 = 4 తప్ప మారేదేమీ లేదు గదా? ఆ లెఖ్ఖల సబ్జెక్టులో ఏమున్నా సాహిత్యమా, సంధులా, వ్యుత్పత్తులా, శాస్త్రమా??

కాని, తన తోడేళ్ళగుట్టు బయటపడనందుకు సంతోషిస్తూ బయటికి వెళ్ళాడు - రంగయ్య. అయిదు నిమిషాలు వరండాలో తచ్చాడివచ్చాడు. కామయ్య జేబులోని దువ్వెనతీసి తల నున్నగా దువ్వుకుంటున్నాడు 'నలభై ఏళ్ళ లెక్కల పంతులుకు యీ సింగారింపేమిటో' అని నవ్వుకున్నాడు రంగయ్య. 'రేపు సాయంత్రం మ్యాటినీ ఆట వుంటుంది కదూ?' అని అడిగాడు కామయ్య.

"శనివారం గదా, వుంటుంది...లీలాసినిమా హాల్లో 'లైలామజ్నూ' అనుకుంటాను. ఏం కథ, మాజోరుగా వుందే కామయ్యగారూ!?" అని రంగయ్య వ్యంగ్య ప్రశ్న. 'రేపటితో మా ప్రాబ్లమ్స్ అన్నీ సాల్వయిపోతాయ్, ఇక మేమిద్దరమూ ముహూర్తం నిర్ణయించుకోవడమే తరువాయి' అని మనసార నవ్వుతూ చెప్పాడు లెఖ్ఖల మాష్టరు.

'ఓహ్హో! అదా సంగతి? అయితే ఆగరల్స్ స్కూల్ పంతులమ్మ మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడానికి ఒప్పుకుందన్నమాట! ఏం అదృష్టం! అయితే రేపు నాతోపాటు లైబ్రరీకి రారన్నమాట?' అన్నాడు రంగయ్య.' అబ్బే! ఏమాత్రం వీలున్నా వచ్చే వాణ్ణే సుమండి. రేపు మూడుగంటల మ్యాటినీకి సినిమాకి వెళ్ళాలి; తర్వాత కృష్ణానది ఒడ్డున కాస్సేపు తిరిగిరావాలి; మోడరన్ కేఫ్‌లో డిన్నర్ మా యిద్దరికీని; ఆ రాత్రంతా ఆమె యింట గడపాలి...' స్వర్గసీమల్లో విహరిస్తున్నంత ఆనందంతో చెప్పాడు కామయ్యగారు.

ఒక్క నిట్టూర్పుతో బీడీ వెలిగించాడు రంగయ్య. ఇంతలో బెల్ మోగింది. ఇళ్ళకు దారితీశారందరూ. తోడేళ్ళను సముదాయించడానికి రోజూ హడావిడిగా వెళ్ళే రంగయ్య యివ్వాళ తాపీగా బీడీ పీలుస్తూ పేవ్‌మెంటు ప్రక్కనే నడుస్తున్నాడు.

తనూ వయసులో వున్నప్పుడు ఎందరో సుందరాంగుల గురించి, తీయని కలలుగనేవాడు. పొరుగిళ్ళవాళ్ళ అమ్మాయిలూ, క్లాస్‌మేట్సూ, కాలేజి గరల్సూ అయిన తర్వాత తన కాబోయే భార్యను గురించి ఊహించుకుని వుప్పొంగి పోయేవాడు. పెళ్ళయిన తర్వాత భార్య కాపురానికి రాక ముందు — ఆమె రాగానే గడపవలసిన దినచర్యకు బుర్రలో ప్లానులు వేసుకునేవాడు. అందులో సినిమాలూ, హోటళ్లూ, కృష్ణానదీ, పార్కు- అన్నీ ఆనందమిచ్చే వ్యవహారాలే వుండేవి. ఆ తర్వాత ఆమె పుట్టింటికి వెళ్ళినప్పుడల్లా ఆ విరహవేదన; యీసారి ఏమయినా సరే ఆనందంగా గడపాలనే ఆ కాంక్ష-అహో, ఆనందం వెల్లివిరిసి, తనతో 'రాసక్రీడ' పాడించేవి!!

ఏం లాభం! ఆరోజులు గతించాయ్. ఇప్పుడిహ తన ఆకలితోడేళ్ళ బాధ. తను ప్రియురాండ్రను గురించి కన్న కలలకంటే యీ తోడేళ్ళ బాధలేసి—హోటల్ భోజనం; విందుభోజనం; సొసైటీ డిన్నర్; ఫలహారాలూ, గుక్క తిప్పుకోనంతగా మెక్కుతున్న దృశ్యాల కలలు చాలా ఎక్కువయాయి. ప్రియురాలి సాన్నిధ్య స్వప్న సౌఖ్యంకంటే. యీ యిష్టభోజనపు కలలు అమిత సౌఖ్యంగా నోరూరిస్తున్నాయి. ప్రేయసి పొందుకన్న. విందుభోజనపు పొందు వేయిరెట్లు విలువగా కనిపిస్తుంది. కాని, అదేంఖర్మో తనను కన్నట్లు శని ఆదివారాల్లో కాదుగదా, పండుగనాడన్నా ఓస్నేహితుడూ విందుకాహ్వానించడేం? తనూహించినదానికి వ్యతిరేకంగా శనాదివారాల్లో ప్రస్తులుండవలసి వస్తుంది కూడాను.

'ఇంతకూ కామయ్యకి తోడేళ్ళబాధ లేదనుకుంటాను. లేకపోతే యీ తోడేళ్ల బాధలో ప్రేయసిని వెదుక్కుని సంపాదించే ఓపిక, తీరిక ఎక్కడేదుస్తుంది. నేనాతనికంటే ఏ రెండుమూడేళ్ళన్నా చిన్నవాడనే అయివుంటాను. నే ప్రయత్నిస్తే ఆపంతులమ్మ నాకు దక్కకుండాపోయేదా? అతనిలో ఏముంది? లెక్కల మాష్టరు, చచ్చు లెఖ్ఖలు. నేను సాహిత్యారాధకుణ్ణి, ఎం. ఏ., విద్వాన్, బి. ఒ. ఎల్., ఉభయభాషా ప్రవీణను. సరసం, విరహం, ప్రణయం, ప్రణయకలహం- అనునయం అన్నీ మనకి కరతలామలకం. తప్పక ఆ పంతులమ్మ నన్నే వరించేది...ఆ! ఆపంతులమ్మలో ఏముంది? నలభైఏళ్ళది. కాకపోతే చీరఎంచక్కా సింగారిస్తుంది; చక్కని కేశబంధంమీద చక్కగా పూలు తురుముతుంది!'

'ఛీ, పోనిద్దూ! పీడ...యీ ముసలితనంలో మళ్ళా పెళ్ళేమిటి? అని ఎందర్ని పెళ్ళాడినదో .. అబ్బా! తోడేళ్లు విడవకొచ్చాయ్.' బీడీ పారేసి చరచరా యింటికి నడిచాడు స్వయంపాకానికి.

శనివారం రంగయ్యకేమీ తోచింది కాదు. రూపాయి ఖర్చయినా సరే హోటల్లో కడుపు నిండా భోంచేస్తే ఒక్కరోజుకన్నా యీ తోడేళ్ల బాధ వదులుతుంది గదా అనుకున్నాడు. మధ్యాహ్నం మ్యాటినీకి వెళ్ళాడు. నేతాజీ హోటల్లో ఒక్కొక్క కూరా నాలుగేసిసార్లు వడ్డించుకు తిన్నాడు. లేచి చేయి కడుక్కునేసరికి యింకా ఓ చిన్నతోడేలు అరుస్తూనే వున్నట్లు అనుమానపడ్డాడు. విసుగ్గా రెండు రూపాయలు చెల్లించి, బైటికివచ్చి ఆ చిన్నతోడేలును పారదోలేందుకు ఓ అరడజను చక్రకేళీలు కొన్నాడు.

తాపీగా కూర్చుని తిందామని డౌలీపార్కు దాకానడిచాడు. ఓ సిమెంటు బెంచీమీదకూర్చుని అటూ యిటూ పరికించాడు. దూరంగా పూల చెట్లచాటున గడ్డిమీద ఆ పంతులమ్మ కూర్చుని నవ్వుతూంది. కామయ్య చేతులు వెనక్కు కట్టుకుని సాలోచనగా ఆమె ముందు అటూయిటూ నడుస్తున్నాడు. వాళ్ల దాంపత్యం పార్కు-షికారు దాకా వచ్చిందే అని ముడుచుకుపోయాడు రంగయ్య.

చక్రకేళీల సంగతి మరచిపోయి విసుగ్గా ఆలోచిస్తున్నాడు. కాస్సేపటికి కామయ్య తలరేపుకుంటూ, కోటు గుండీలు మాటిమాటికీ పెడుతూ తీస్తూ ఏదో గట్టిగానే మాట్లాడుతున్నట్లు ఎలెక్ట్రిక్ లైటు వెలుతురులో రంగయ్య చూచాడు. అర్థంకాలేదు. తనకెందుకు ఆ వృద్ధులగొడవ అనుకుని—యిక వాళ్ళ ముచ్చట చూడలేక బైటికి నడిచాడు. సిటీబస్‌కోసం నిరీక్షిస్తున్నాడు.

బస్సువచ్చి ఆగింది. తన వెనకాలే కామయ్య కూడాఎక్కి తన ప్రక్కనే కూర్చున్నాడు. తను ఆశ్చర్యపోయి "రాత్రంతా మీ ఆవిడయింట వుంటానంటివే?" అప్పుడే యిలా వంటరిగా వచ్చేశావేమన్నట్లు కామయ్యనడిగాడు. "ఆ ముసిలి కన్య నా భార్యేమిటి? ఇకనలా అనకు బ్రదర్ నా తలనొచ్చుతుంది" అని కణతలుపట్టుకున్నాడు కామయ్య.

ఇదింకా ఆశ్చర్యంగావుంది! "అదేమిటి? మరి, 'యీ రోజుతో ప్రాబ్లమ్సన్నీ సాల్వ్ అవుతాయి, ముహూర్త నిర్ణయమే తరువాయి' అన్నావే?" అడిగేశాడు రంగయ్య-పొంగివచ్చే నవ్వును ఆపుకుంటూ. "అదీ, నాలుగురాళ్లు తెస్తుంది, యింత కాచి పోస్తుందనుకున్నాను గాని—వంటావిడను కోరుతుందనీ, తన తల్లిదండ్రులను కూడా నా యింట్లోనే మేపుతుందనీ తెలిస్తే ఆ ముసిలి దవడల ముద్దులకోసం అంత తాపత్రయపడేవాణ్ణా? అయినా యీ అర్థశతాబ్ద వృద్ధుకు యిప్పుడు పెళ్ళేమిటి? హాయిగా వచ్చిన నాలుగురాళ్ళూ ఖర్చుపెట్టుకుంటూ జీవితంలో ప్యాసయ్ పోయేదానికి?" ఏమి శాశ్వత మన్నట్లు చప్పరించాడు కామయ్య. కాని, అతని కళ్ళల్లో నీళ్ళ పొరలు కమ్మాయని రంగయ్య గ్రహించాడు.

గ్రహించినవాడు సానుభూతి చూపాలి లేక వూరుకోవాలి గాని—"అయినా ముసిలి లెఖ్ఖల మాష్టర్ని, ఆ టక్కులాడి ఎలా ప్రేమిస్తుందనుకున్నావ్?" అంటూ, పెద్ద డిస్కవరీ చేసినట్లు నవ్వి-దర్జాగాకూర్చోబోయాడు రంగయ్య. తొడమీది చక్రకేళీలు పడిబోయాయి.

వంగి చక్రకేళీలు తీసుకు నిటారుగా కూర్చున్నాడు. "కడుపింత నిండుగావుంది, తోడేళ్ళెప్పుడో పారిపోయాయ్, ఎందుకీ పళ్లుకొన్నానా" అని ఖర్చుకు విచారపడ్డాడు.

కండక్టర్ 'పంచ్' మీటుతూవచ్చాడు. "కాలేజ్ హాస్టల్—టూ టిక్కెట్స్" అని పావలా యిస్తూ అరిచాడు రంగయ్య. బస్సులో జనాభా అందరూ ఒక్కసారి రంగయ్య మొఖం మీది వెలుగును చూచి వూరుకున్నారు. "మనుమడో, మనుమరాలో పుట్టినవార్త తెలిసింది కాబోలు" అనుకున్నారంతా.

ఆ హుషారులో రెండు చక్రకేళీలు కామయ్య కోటు ఎదుటిజేబులో దోపాడు రంగయ్య. తోడేళ్ళిక రంగయ్యకోటుకింది స్థావరాన్ని వదిలేసినట్లేనా?